క్లుప్తంగా

రెడ్‌క్రాస్‌లో అందుబాటులో ప్లాస్మా

ఒంగోలు టౌన్‌: ఇండియన్‌ రెడ్‌ క్రాస్‌ సొసైటీ ఒంగోలు బ్రాంచిలో గురువారం నుంచి ప్లాస్మా, పాకెట్‌ సెల్‌ అందుబాటులోకి వచ్చినట్లు చైర్మన్‌ ప్రకాష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు హోల్‌ బ్లడ్‌ మాత్రమే లభ్యమయ్యేదని, ఇక నుంచి ప్లాస్మా కూడా అందిస్తామన్నారు. గతంలో ఎవరికైనా రక్తం కావాల్సి వస్తే దానికి బదులుగా మరో దాతతో రక్తం ఇవ్వాల్సి వచ్చేదని, ఇప్పుడు అలాంటి అవసరం లేకుండా అవసరమైన వారికి కావాల్సిన గ్రూపు రక్తం అందిస్తామన్నారు. ప్రస్తుతం కొత్త కూరగాయల మార్కెట్‌ ఎదురుగా ఉన్న రెడ్‌క్రాస్‌ భవనంలోకి బ్లడ్‌ బ్యాంకును మార్చామని, ప్రజలు ఈ మార్పును గమనించాలని కోరారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

మద్దిపాడు: మండల పరిధిలోని ఎన్‌హెచ్‌ 16 జాతీయరహదారిపై ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ శివరామయ్య గురువారం తెలిపారు. మండలంలో ఎక్కువగా గుండ్లాపల్లి గ్రోత్‌ సెంటర్‌, కొస్టాలు, దొడ్డవరప్పాడు, ఏడుగుండ్లపాడు సమీపంలో జాతీయరహదారిపై ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈక్రమంలో రాత్రి సమయంలో ప్రయాణించే వాహనదారులు నిద్రమత్తులోకి వెళ్లకుండా తెల్లవారు ఝామున వారిని ఆపి నీళ్లతో ముఖం కడిగిస్తున్నట్లు చెప్పారు. జాతీయరహదారిపై ప్రమాదాలు జరగకుండా నివారించడానికి తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కార్యదర్శి సేవలు ప్రశంసనీయం



పంచాయతీ కార్యదర్శిని సన్మానిస్తున్న గ్రామ ప్రజలు

సంతనూతలపాడు: మండలంలోని మద్దులూరు సచివాలయంలో బదిలీపై వెళ్తున్న పంచాయతీ కార్యదర్శి ఏ. శ్రీనివాసరావును సర్పంచ్‌ ఎం. శైలజ అమర్నాథ్‌, సచివాలయం సిబ్బంది గురువారం సత్కరించారు. మద్దులూరు గ్రామాభివృద్ధిలో సహకరించిన వైనాన్ని గుర్తు చేసుకున్నారు. కాగా నాగులుప్పలపాడు మండలం బ్రాహ్మణ నిడమానూరు పంచాయతీ కార్యదర్శిగా శ్రీనివాసరావు బదిలీ అయ్యారు. సన్మాన కార్యక్రమంలో నాయకులు మీరయ్య, రవిబాబు పాల్గొన్నారు.

రుణాలు మంజూరు చేయండి



బ్యాంకర్లతో మాట్లాడుతున్న కమిషనర్‌ రామకృష్ణయ్య

చీమకుర్తి: అర్హులైన లబ్ధిదారులకు వెంటనే రుణాలు మంజూరు చేయాలని చీమకుర్తి మున్సిపల్‌ కమిషనర్‌ వై.రామకృష్ణయ్య బ్యాంకర్లకు విజ్ఞప్తి చేశారు. గురువారం మున్సిపల్‌ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విశ్వకర్మ పథకానికి దరఖాస్తు చేసుకున్న వారికి రుణాలను అందించాలన్నారు. వాటితో పాటు వ్యక్తిగతంగా యూనిట్లు ఏర్పాటు చేసేవారికి, పొదుపు సంఘాల వారికి తక్షణమే రుణాలను మంజూరు చేయటంలో సహకరించాలని బ్యాంకర్లకు విజ్ఞప్తి చేశారు. రుణాల రికవరీలో తమ వంతు సహకారం అందిస్తామన్నారు. స్టేట్‌ బ్యాంక్‌, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్‌, యూనియన్‌ బ్యాంక్‌ అధికారులు, మెప్మా సిబ్బంది చిరంజీవి పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



పురస్కారాలను అందుకున్న విద్యార్థులతో పద్మశాలీయుల సంఘ నాయకులు

చీమకుర్తి: పద్మశాలీయుల సేవా సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ మార్కులను సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించారు. గురువారం చీమకుర్తి భావనారుషి ఆలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి చేనేత, జౌళి ఏడీ రఘునందన్‌, డెవలప్‌మెంట్‌ ఆఫీసర్‌ ఎ.వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారి చేతుల మీదుగా విద్యార్థులకు పురస్కారాలు, మెమెంటోలను అందించి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ గోపురపు రాజ్యలక్ష్మి, పద్మశాలీయుల సంఘం నాయకులు గోపురపు చంద్ర, కౌన్సిలర్‌ సోమా శేషాద్రి, దోమల పుల్లయ్య, సోమా యానాదిశెట్టి, అవ్వారు ఆదినారాయణ, సంఘంలోని ప్రధాన నాయకులు పాల్గొన్నారు.

శునకాల నగరం



సంతపేటలోని ఐఎంఏ హాలు వద్ద వాహనదారుడిపై దాడికి సిద్ధంగా ఉన్న కుక్కలు



అన్నవరప్పాడు 4వ లైన్‌లో..

- వీధుల్లో స్వైరవిహారం
- రోడ్డెక్కాలంటే భయపడుతున్న జనం
- కోర్టు సాకుతో మిన్నకుంటున్న అధికారులు
- స్టెరిలైజేషన్‌ జోలికిపోని వైనం

ఒంగోలు వన్‌టౌన్‌: నగరంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఏ వీధిలో చూసినా కుక్కలు దెబ్బకు స్థానికులు హడలిపోతున్నారు. అత్యున్నత కోర్టు కుక్కలను ఏమీ చేయవద్దని, స్టెరిలైజేషన్‌ మాత్రమే చేయాలని ఆదేశించింది. దీంతో వాటిని ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. అయితే అధికారులు మాత్రం స్టెరిలైజేషన్‌ కూడా చేయకుండా తాత్సారం చేస్తున్నారు. దీంతో కుక్కల సంతానం నగరంలో విపరీతంగా పెరిగిపోతోంది. ప్రతి వీధిలో దాదాపు పది కుక్కలు వరకూ కాపుకాసి ఉంటున్నాయి. దీంతో స్కూళ్లకు వెళ్ళే పిల్లలతో పాటు వృద్ధులు భయాందోళనలు చెందుతున్నారు. అన్నవరప్పాడు, రామ్‌నగర్‌, సంతపేట, కబాడీపాలెం, రైలు పేట తదితర ప్రాంతాల్లో అయితే మరీ ఎక్కువగా సంచరిస్తున్నాయి. ఒక్కో కుక్క సంవత్సరానికి రెండు సార్లు దాదాపు 5 పిల్లల చొప్పున ఈనుతుండటంతో కుక్కల సంఖ్య విస్తరిస్తోంది. వచ్చే పోయే వారిపై దాడి చేస్తూ చేతిలో ఏది ఉంటే అది తినడానికి దూకుతున్నాయి. నిత్యం ఎవరో ఒకరు వాటి దాడికి గురై ఆస్పత్రుల్లో చేరుతున్నారు. రాత్రి పూట ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారైతే అరచేతుల్లో ప్రాణాలు పెట్టుకుని వణికిపోతున్నారు. మరి కొందరు వాహనదారులు కింద పడిపోతున్నారు. కొంతమంది తల్లిదండ్రులు కర్రలు చేతుల్లో పట్టుకొని పిల్లలను బడికి తీసుకెళ్లాల్సి వస్తోంది.

సమీక్షలతోనే సరి

యానిమల్‌ బర్త్‌ కంట్రోల్‌, వీధికుక్కల నియంత్రణ గురించి పశుసంవర్ధక శాఖ అధికారులతో సమావేశం నిర్వహించిన మున్సిపల్‌ ఉన్నత అధికారులు ఆదిశగా చర్యలు మాత్రం చేపట్టడంలేదు. ఒంగోలు నగరంలో వీధి కుక్కల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు స్నేహ యానిమల్‌ వెల్ఫేర్‌ సొసైటీ వారు కుక్కలను పట్టుకుని జియో ట్యాగింగ్‌ చేయలి. అనంతరం వాటికి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు నిర్వహించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు.

ప్రజలు భయపడుతున్నారు:



సంత పేటలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. మెడికల్‌ అసోసియేషన్‌ హాలు సమీపంలో దాదాపు పది కుక్కలు గుంపులుగా తిరుగుతుండటంతో ప్రజలు భయపడుతున్నారు. గత వారంలో ఇతర దేశస్తులపై దాడి చేయడానికి కుక్కలు ప్రయత్నించడంతో స్థానికులు వాటిని తరిమివేశారు. ఇదే ప్రాంతంలో ప్రయివేటు పాఠశాల కూడా ఉండటంతో పాఠశాల వదిలే సమయంలో సిబ్బంది ఉండి కుక్కలను తరిమి పిల్లలను ఇళ్లకు పంపుతున్నారు.

మాధవరావు

రెండు రేషన్‌ దుకాణాలు సీజ్‌



తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

సంతనూతలపాడు: మండలంలో పలు రేషన్‌ దుకాణాలపై గురువారం అధికారులు దాడులు చేసి బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఎం.వేములపాడు, పి. తక్కెళ్ళపాడు గ్రామాల్లో రెండు రేషన్‌ దుకాణాల్లో స్టాకు కన్నా అధికంగా 65 బస్తాల రేషన్‌ బియ్యం ఉండటంతో ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు ఈ మేరకు 6ఏ కేసులు నమోదు చేశారు. అనతరం వాటిని సీజ్‌ చేశారు. ఎం వేములపాడులో షాప్‌ నెంబర్‌ 38కు చెందిన రేషన్‌ దుకాణంపై ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డిప్యూటీ తహసీల్దార్‌ షేక్‌ ఫిరోజ్‌ బాషా, పొదిలి ఎఫ్‌ఐ ప్రమోదు దాడి చేశారు. స్టాక్‌ రికార్డులు కన్నా 60 బస్తాలు రేషన్‌ బియ్యం అధికంగా ఉండటంతో బియ్యం సీజ్‌ చేసినట్లు పేర్కొన్నారు. పి. తక్కెళ్ళపాడు గ్రామంలో షాప్‌ నెంబర్‌ 42లో స్టాక్‌ కన్నా అధికంగా ఆరు బస్తాలు రేషన్‌ బియ్యం ఉన్నట్టు గుర్తించి కేసు నమోదు చేశారు. వేములపాడు, తక్కెళ్ళపాడు గ్రామాల్లో స్టాకు కన్నా 65 బస్తాలు రేషన్‌ బియ్యం అధికంగా ఉండటంతో సీజ్‌ చేసి సంబంధిత వీఆర్‌ఓలకు అప్పగించారు.

స. హ చట్టం ఆవిర్భావ వారోత్సవాలు నిర్వహించాలి



వినతి పత్రం అందజేస్తున్న అమృతపాణి

కొత్తపట్నం: సమాచార హక్కు చట్టం 2005 వారోత్సవాలను ప్రభుత్వం నిర్వహించాలని సామాజిక సహోద్యమ వేదిక రాష్ట్ర కార్యదర్శి జి. అమృతపాణి డిమాండ్‌ చేశారు. ఈ మేరకు గురువారం ఎంపీడీఓకు వినత పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అమృతపాణి మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార చట్టం బోర్డులను తప్పని సరిగా ఏర్పాటు చేయాలని, అందులో అధికారుల పేర్లు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని కోరారు. అలాగే ప్రతి కార్యాలయంలో సెక్షన్‌ 4(1)బి, 17 అంశాల సమాచారం అప్డేట్‌ చేసి ఉంచాలని డిమాండ్‌ చేశారు. సమాచార చట్టం ఆర్టీఐ కోఆర్డినేషన్‌ కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. చట్టం వచ్చి 19 సంవత్సరాలు పూర్తవుతున్నా కొంత మంది అధికారులకు అవగాహన లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఉన్న ఏకైక ఆయుధం సమాచార హక్కు చట్టమని ప్రతి ఒక్కరూ ఈ చట్టం ఉపయోగించుకుని అవినీత అధికారులకు గుణపాఠం చేప్పాలని వివరించారు. గ్రామాల్లో చేపట్టిన పనులను, రికార్డులను ప్రజలను పర్యవేక్షించే బాధ్యత ఈ చట్టం కల్పిస్తుందని, ఈ చట్టం ముందు అంతా సమానులేనని స్పష్టం చేశారు. గత 12 సవత్సరాల నుంచి ఆర్టీఐ దరఖాస్తులు వేస్తున్నప్పటికీ సరైన సమాధానం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారుల ఈ నెల 12 నుంచి 19 వరకు సమాచార చట్టం వారోత్సవాలు నిర్వహించాలని.. లేదంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ డిమాండ్లపై ఎంపీడీవోకు వినత పత్రం అందజేశారు.

చినుకు పడితే చిత్తడే...



పెదకొత్తపల్లి అంజయ్య నగర్‌ కాలనీలో కొద్దిపాటి వర్షానికే ఖాళీ స్థలంలో నిలిచిపోయిన నీరు



సీసీ రోడ్డు పై ప్రవహిస్తున్న నీరు

మద్దిపాడు: మండలంలోని పెదకొత్తపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న అంజయ్య నగర్‌ కొద్దిపాటి వర్షానికే చిత్తడిగా మారిపోతోంది. కాలనీలో పూర్తి స్థాయిలో సీసీ రోడ్లు సైడు డ్రైన్లు లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. సీసీ రోడ్డు రెండు మూడు బజార్లకు మాత్రమే ఉండగా మిగిలిన చోట లేవు. దాదాపు 30 సంవత్సరాల క్రితం ఏర్పడిన కాలనీ కావడం.. పొలాల మధ్యలో ఉండడంతో వర్షపు నీరు మొత్తం కాలనీలోకి చేరుతోంది. అంతే కాకుండా సైడు డ్రైన్లు లేకపోవడంతో కాలనీలో నీరు బయటకు పోవడానికి లేక నిలిచి పోతోంది. వర్షాకాలంలో దోమలు విపరీతంగా పెరుగుతున్నాయి. కాలనీ వాసులు విష జ్వరాల బారిన పడుతున్నారు. కాలనీలో ఉన్న ఖాళీ స్థలాన్ని లోతట్టులో ఉండటంతో నీరు చేరి మురుగు ఏర్పడుతోందని కాలనీ వాసులు తెలిపారు.

ఎల్‌ఐసీ ఏజెంట్ల వ్యవస్థ నిర్వీర్యం చేయవద్దు

ఒంగోలు వన్‌టౌన్‌: ఎల్‌ఐసీ ఏజెంట్ల వ్యవస్థను నిర్వీర్యం చేసే చర్యలు నిలిపి వేయాలని ఎల్‌ఐసీ ఏజెంట్ల యూనియన్‌ లియాఫి ఒంగోలు అధ్యక్షుడు మన్నం ప్రసన్నరాజు డిమాండ్‌ చేశారు. ఒంగోలు ఎల్‌ఐసీ కార్యాలయంలో నెల్లూరు డివిజన్‌ మార్కెటింగ్‌ మేనేజర్‌ కృష్ణమూర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఒంగోలు బ్రాంచ్‌ మేనేజర్‌ రహమాన్‌ను కలిశారు. ఎల్‌ఐసీ యాజమాన్యం ఏజెంట్‌ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు పాలసీదారుల వయస్సును తగ్గించడం, పాలసీలపై వచ్చే కమిషన్లను భారీగా తగ్గించడం, పాలసీదారులకు జీఎస్టీ విధించడం వంటి ఆలోచనలకు రూపకల్పన చేస్తోందన్నారు. ఇటువంటి చర్యలను నిలిపివేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మధు గోవింద్‌, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, రామకృష్ణ, సునీల్‌, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సీఎం మాట నిలబెట్టుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఎంఆర్పీఎస్‌ నాయకులు

చీమకుర్తి: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేస్తానని చెప్పిన మాటను నిలబెట్టుకోవాలని ఎంఆర్పీఎస్‌ నాయకులు డిమాండ్‌ చేశారు. మంద కృష్ణ మాదిగను తెలంగాణ ప్రభుత్వం అరెస్ట్‌ చేసినందుకు నిరసనగా గురువారం చీమకుర్తిలో పోలీస్‌ స్టేషన్‌ ఎదుట ఉన్న బాబూ జగ్జీవన్‌రామ్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన తెలిపారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఉద్యోగాల్లో ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్‌లను అమలు చేయాలని డిమాండ్‌ చేసినందుకే మందా కృష్ణ మాదిగను అరెస్ట్‌ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జడా విజయకుమార్‌, పాటిండ్ల జక్రయ్య, బిరుదుల లింగయ్య, బుట్టి సాల్మన్‌ పాల్గొన్నారు.

కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి



శాంసంగ్‌ షోరూం ఎదుట నిరసన చేస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్‌: మద్రాసు శాంసంగ్‌ కంపెనీలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు డిమాండ్‌ చేశారు. గురువారం స్థానిక కర్నూలు రోడ్డులోని శాంసంగ్‌ షో రూం ఎదుట నిరసన చేపట్టారు. నాలుగు వారాలుగా మద్రాసు శాంసంగ్‌ కార్మికులు సమ్మె నిర్వహిస్తున్నారని చెప్పారు. సమస్యలను పరిష్కరించకపోగా కార్మికులను భయాందోళనలకు గురిచేస్తున్నారని ఆవేదన చెందారు. కంపెనీలో 2 వేల మంది కార్మికుల పని చేస్తున్నారని, వారిలో 1500 మంది సీఐటీయూ కార్మిక సంఘంలో సభ్యులుగా చేరారని తెలిపారు. విదేశాల్లో శాంసంగ్‌ కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగులకు లక్షల రూపాయల వేతనాలు ఇస్తున్న కంపెనీ భారత దేశంలో పనిచేస్తున్న వారికి 20 నుంచి 30 వేల రుపాయలను మాత్రమే ఇస్తుందని తెలిపారు. అయ్యప్పరెడ్డి, ఎం. బాబు, ఆర్‌. రాములు, ఆర్‌. శ్రీనివాసరావు, జి. అంకయ్య పాల్గొన్నారు.

మండల పరిషత్‌ కార్యాలయం సందర్శన



ఎంపీడీవో కార్యాలయ సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ

నాగులుప్పలపాడు: జెడ్పీ సీఈఓగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన భూపతి చిరంజీవి జిల్లా వ్యాప్తంగా ఉన్న మండల పరిషత్‌ కార్యాలయాలను సందర్శిస్తున్నారు. గురువారం నాగులుప్పలపాడు మండల పరిషత్‌ కార్యాలయాన్ని సందర్శించి సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. కార్యాలయ శుభ్రత పై సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ కార్యాక్రమాలపై ప్రజలకు నిరంతరం సూచనలు అందించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో మహాలక్ష్మి, ఏఓ దక్షిణామూర్తి ఈవోఆర్డీ మురళీమోహన్‌ సిబ్బంది పాల్గొన్నారు.

కాపాడవమ్మా.. దుర్గాదేవీ!



బాలాజీ రావుపేటలో కనకదుర్గ కళారాలు



ఆకట్టుకున్న విచిత్ర వేషధారణలు



అంకమ్మపాలెంలో నృత్యాలు తిలకిస్తున్న జనం

నగరంలో దసర ఉత్సవాలు అంబరాన్నంటుతున్నాయి. రోజుకో రూపంలో అమ్మవారు దర్శనమిస్తున్నారు. గురువారం పలు ఆలయాల్లో అమ్మవార్లు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే కళారాల ఉత్సవాలు వైభవోపేతంగా జరిగాయి.

సాక్షి, ఒంగోలు:



కరెన్సీ నోట్లతో అలంకరణలో కనకదుర్గాదేవి అమ్మవారు



అంకమ్మపాలెం కాళికాదేవి కళారాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు



బాలాజీరావు పేటలో హాజరైన భక్తులు



బాలాజీరావుపేటలో..



త్రిపురాంతక పార్వతి



దుర్గాదేవి అలంకరణలో గొడుగుపాలెం కనకదుర్గాదేవి అమ్మవారు